ప్రజాశక్తి
ఆదివారం 28 జులై 2024
5
విజయనగరం



కర్నూలు ట్రిపుల్ ఐటిలో మన్యం జిల్లా విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయనగరం కోట

కర్నూలు జిల్లాలోని ట్రిపుల్ టిలో మూడో ఏడాది ఇసిఇ చదువుతున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నల్లసాయి కార్తీక్‌నాయుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 22నుంచి తరగతులకు హాజరయ్యాడు. ఈక్రమంలో శనివారం ట్రిపుల్ ఐటి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. అధ్యాపకులు మందలించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- వ్యవసాయాధికారుల సమీక్షలో మంత్రి కె.శ్రీనివాస్
- రైతు సేవా కేంద్రాల్లో మిగిలిన ఎరువులను ప్రైవేటు వారికి ఇవ్వాలి : కలెక్టర్
- ప్రజాశక్తి కథనాలకు స్పందన



సమావేశంలో రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖ మంత్రి కె.శ్రీనివాస్ తెలిపారు. ఆ మేరకు వ్యవసాయాధికారులంతా సన్నద్ధంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఎరువుల కొరతపై ప్రజాశక్తిలో గత రెండు రోజులుగా వచ్చిన కథనాలకు మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ స్పందించి శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎరువులు పేద రైతులకే అందేలా చూడాలని , ఈ సీజన్ లో వేసిన అన్ని పంటలకు సహాయం అందించాలని సూచించారు. ఈ మూడు నెలలు రైతుకు కీలకమని, రైతు వెంటే ఉంటూ వారికి అవసరమగు ఇన్పుట్స్ అందజేయాలని తెలిపారు. మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ ఉండేలా చూడాలని, సోమవారం నాటికి అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మండల వారీగా ఎరువుల పరిస్థితి పై సమీక్షించారు. మొత్తం ఏ మేరకు ఎరువులు అవసరం ఉన్నది, ప్రస్తుతం ఎంత వరకు స్టాక్ ఉన్నదీ అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి తారక రామా రావు మాట్లాడుతూ శనివారం 800 టన్నులు, ఆదివారం 800 టన్నుల ఎరువులు రానున్నాయని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ముందుగా రైతుసేవా కేంద్రాల్లో సరిపడా ఎరువులను స్టాక్ చేయాలని, మిగిలిన తర్వాతే ప్రైవేటు డీలర్లకు ఇవ్వాలని ఆదేశించారు ఆర్‌ఎస్‌కెలలో ఇండెంట్ ప్రకారంగా స్టాక్ లు ఉండాలని అన్నారు. ఎక్కడైనా ఎరువులు కొరత ఉందని దృష్టికి వస్తే సంబంధిత వ్యవసాయాధికారిదే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఆగష్టు నెలాఖరు కల్లా నాట్లు వేయడం పూర్తవుతుందని, ఈ లోపల వ్యవసాయ అధికారులంతా రైతులకు తగు సలహాలను అందజేయాలని తెలిపారు. పత్రికల్లో వచ్చే వార్తల పట్ల బాధ్యతగా స్పందించాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని, మార్క్‌ఫెడ్ డిఎం విమల, ఎపి సీడ్స్ డిఎం పద్మ , వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు.

ఒలింపిక్స్ లో ఘన విజయాలు సాధించాలి

భారత క్రీడాకారులు ఒలింపిక్స్ క్రీడల్లో ఘన విజయాలు సాధించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఐ చీర్ ఫర్ భారత్ నినాదంతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఆయన శనివారం సెల్ఫి దిగారు. భారత క్రీడాకారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

- గంజాయి రవాణా నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్‌పి వకుల్ జిందాల్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లాపోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్ష నిర్వహించారు. విజిబుల్ పోలీసింగును ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో విధిగా నిర్వహించాలని తెలిపారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. హిస్టరీ షీట్లు కలిగి, చురుకుగా ఉండే వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, వారి ప్రవర్తనను గమనించాలని తెలిపారు. వివిధ కేసుల్లో అరెస్టు కాబడే వ్యక్తుల నేర చరిత్రను పరిశీలించి, వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు పగలు, రాత్రుల బీటులతో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా చూడాలని, మహిళా సంరక్షణ పోలీసుల సహకారాన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ కేసుల్లో పోలీసు సిబ్బంది పాత్ర ఉన్నట్లుగా విచారణలో వెల్లడైతే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు, జిగ్ జాగ్ రేడియం స్టిక్కర్లను, జాతీయ రహదారులపై ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎం.ఎం.సోల్మన్, డిఎస్‌పిలు గోవిందరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, వీరకుమార్, విశ్వనాథ్, యూనివర్స్, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై 30న అవగాహన : డిఎస్‌పి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు కారణమైన గుర్తు తెలియని వాహనాల కేసుల్లో బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు విజయనగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషనులో ఈనెల 30న ఉదయం 11గంటలకు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ట్రాఫిక్ డిఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదానికి గురైనప్పటికీ, ప్రమాదానికి కారణమైన వాహనం తెలియక పోయినప్పటికీ (హిట్ అండ్ రన్) ఆయా కేసుల్లో బాధిత కుటుంబాలకు నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఇందులో భాగంగా హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వ్యక్తులకు రూ. 50వేలు చొప్పున నష్ట పరిహారంగా ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసు స్టేషనులో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో బాధిత కుటుంబాలు పాల్గొనాలని కోరారు.

మాజీ జవాన్ ఇంటి ప్రహరీ కూల్చివేత

భారీ పోలీసు పహారా మధ్య

- విలపించిన బాధిత కుటుంబీకులు
- టిడిపి నాయకుల కక్ష సాధింపేనని ఆరోపణ



రోదిస్తున్న రిటైర్డ్ జవాను, ఆయన భార్య



ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్నారని రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇంటిని రెవెన్యూ అధికారులు శనివారం భారీ పోలీసు బలగాల సాయంతో కూల్చి వేసేందుకు యత్నించారు. గ్రామస్తులంతా జవాన్ కుటుంబానికి అండగా నిలిచి అడ్డుకోవడంతో జెసిబితో ప్రహరీ కూల్చివేసి వదిలేశారు. మండలంలోని దన్నానపేటలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ పతివాడ పైడి చిట్టి దన్నానపేట - కుమిలి రహదారిలో సర్వే నంబర్ 88పి కొండ పోరంబోకు స్థలంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. అయితే ఇంటిని ప్రభుత్వ స్థలంలో నిర్మించారని టిడిపి నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ విచారణ జరిపి ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేసినట్లు గుర్తించారు. దీంతో శనివారం భారీ పోలీస్ బలగాల మోహరింపుతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. దీంతో ఆర్మీ జవాన్ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇంటిని కేవలం కక్షసాధింపుతోనే కూల్చి వేస్తున్నారని రోదించారు. దేశ సేవలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సొంత గ్రామంలో ఇళ్లు నిర్మించుకుంటే కూటమి ప్రభుత్వం అక్రమ నిర్మాణం పేరిట తనకు మంచి బహుమానం ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎంతోమంది ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేశారని వాటిని కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు అక్కడెక్కడో నీతులు చెబుతున్నారు గాని గ్రామ స్థాయిలో కక్షసాధింపు చర్యలు కనబడలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిబంధనల ప్రకారమే ఆక్రమణల తొలగింపు

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఆక్రమణను తొలగించా మని తహశీల్దార్ ధర్మ రాజు తెలిపారు. రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడను, ప్రజా ప్రయోజ నాల కోసమే తొలగించా మని తెలి పారు. ముందు గానే ఆక్రమణ దారుడికి నోటీసు ఇచ్చామని, ఆయన నుంచి స్పందన రాక పోవడం తో తొలగించా మని పేర్కొన్నారు.

అవగాహన లేని మాటలు వద్దు: రాజారావు

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రహరీ తొలగింపుపై అవగాహన లేకుండా మాట్లాడటం సరి కాదని దన్నానపేట మాజీ సర్పంచ్, టిడిపి జిల్లా అధికారి ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. ఇటువంటి ఘటన తమ ప్రభుత్వం లో జరగలేదని చెప్పడం విడ్డూ రంగా ఉంద న్నారు. వైసిపి ప్రభుత్వంలో 2020లో అదే సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి పేరిట ఎస్‌సి, బిసిలకు చెందిన ఐదు ఇళ్లు, 200 టేకు చెట్లు తొలగించలేదా అని ప్రశ్నించారు. అప్పుడు అడ్డుకున్న 11 మందిపై కూడా వైసిపి ప్రభుత్వం కేసులు పెట్టిందన్న సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పుడు అదే సర్వే నెంబరులోని ఒక వ్యక్తి ఇంటికి సంబంధించిన ప్రహరీ రోడ్డుకు అడ్డంగా కట్టేయడంతో తొలగించారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. గత వైసిపి ప్రభుత్వమే ప్రహరీ తొలగించాలని వారికి నోటీసు ఇచ్చిన విషయాన్ని గమనించాలని కోరారు.

విధ్వంస రాజకీయాలు సరికాదు

ఆర్మీ జవాన్ ఇల్లు కూల్చేయడమే మీ రాజకీయమా?

ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దన్నానపేటలో ఆర్మీ జవాన్ ఇంటిని కూల్చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 ఏళ్లు దేశానికి సేవ చేసిన జవాన్ ఇంటిని ముందస్తు సమాచారం లేకుండా బుల్డోజర్‌తో కూల్చేయడం దారుణమైన ఘటన అన్నారు. ఆయన ప్రభుత్వ స్థలంలో ప్రహరీ గోడ నిర్మించుకున్నారని 50 మంది పోలీసులను వెంట బెట్టుకొని వెళ్లి బుల్డోజర్‌తో తొలగించడం ఏం సాంప్రదాయమని ప్రశ్నించారు. దేశం కోసం పోరాడిన ఆర్మీ ఉద్యోగి ఇంటిని కూల్చేస్తే వచ్చిన లాభమేమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు రాజకీయాలు, పదవులు కొత్త కావచ్చని, ఇటువంటివి ప్రోత్సహించడం సరికాదని అన్నారు. రాష్ట్రపతిని కూడా ఆర్మీ జవాను బతిమాలిడుతున్నాడు అంటే ఎంత దయనీయమైన పరిస్థితి ఉందో అర్ధమవుతుందన్నారు. ఆ గ్రామంలో మరో ఐదుగురు కూడా అదే మాదిరి ఇళ్లు నిర్మించారని, కేవలం ఆర్మీ జవాన్ ఇంటిని కూల్చేయడం కక్ష సాధింపని అన్నారు. జిల్లా కలెక్టర్ ఏ విధంగా ఇల్లు కూల్చడానికి అనుమతించారని ప్రశ్నించారు. నాయకులు మానవతా దక్పథంతో ఆలోచించాలని కోరారు. విజయనగరంలో అదే విధంగా ఈ మధ్య చేశారన్నారు. రాజీవ్ నగర కాలనీలో దగ్గర ఆ వ్యక్తికి పట్టా అశోక్ గజపతిరాజు ఇచ్చిందేనని, అధికారంలోకి వస్తే ఒకలాగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి సాంప్రదాయాలు జిల్లాలో దయచేసి తీసుకురావద్దని కోరారు.ఇటువటి ఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్, ఎస్‌పి చూడాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సహారా బాధితులకు న్యాయం చేయాలి

- 29న నియోజవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- పోరాట కమిటీ గౌరవ సలహాదారు తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సహారా ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 29న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జరుగు ధర్నాలకు, బాధితులు, ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ సలహాదారు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఎల్‌బిజి భవన్‌లో సహారా బాధితుల సమావేశం జరిగింది. ముందుగా పోరాట కమిటీని 20 మందితో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా బిఎల్ దాస్, జనరల్ సెక్రెటరీగా ఎం.సూరిబాబు, గౌరవ సలహాదారుగా టి .సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులుగా కె.సురేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.నాయుడు, ఎస్‌ఎ ఖాన్, జి.అన్నాజీ రావు, జాయింట్ సెక్రెటరీలుగా ఎ.శ్రీనివాసుబాబు, కె.మోహన్ రావు, ఎ.బాలకృష్ణ, కోశాధికారిగా పి.సాయికృష్ణ, కమిటీ సభ్యులుగా కె.ప్రకాష్ వి.కుమార్, నర్సింగరావు, జి.ఎల్ నారాయణ, వైఎనాయుడు, వి.శ్రీనివాసరావు, ఐఎస్ నాయుడు, ఎస్‌వి రమణ, ఎం.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, బి.లక్ష్మీ దాస్‌తో తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సహారా ఇండియా సంస్థ లాభాలను ఆశ చూపించి పేదల నుంచి లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్లు రూపంలో వసూలు చేసిందన్నారు. అగ్రిగోల్డ్ కన్నా పెద్ద ఎత్తున ప్రజలను మోసం చేసింది. ఖాతాదారుల, ఏజెంట్‌ల కుటుంబ భవిష్యత్తు కోసం, పిల్లల చదువుల కోసం ఉపయోగపడతాయని ఆశించి డిపాజిట్లు చేస్తే బాండ్ల గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకుండా రెన్యువల్ చేస్తూ మోసం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకుకృషి చేయాలి

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు జిల్లా కేంద్రంలోని ఎపెక్స్ జూనియర్ కళాశాలలో బాలల హక్కుల అమలు, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు డ్రగ్స్ వల్ల యువత చెడు మార్గంలో పయనిస్తున్నారు వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ఉందన్నారు డ్రగ్స్ నియంత్రణకు వందరోజుల ప్రణాళికను సిద్ధం చేశామని, దీన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆర్ఐఒ మజ్జి ఆదినారాయణ జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ జి.హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాఖాపరమైన పరీక్షలకు ఏర్పాట్లు : డిఆర్ఒ

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 28 నుండి ఆగష్టు 2 వ తేదీ వరకు జరగనున్న శాఖాపరమైన పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఆర్ఒ ఎస్‌డి అనిత తెలిపారు. సీతం కళాశాల లో అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలుగా ఉదయం 10 గంటల నుండి 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఐడి ప్రూఫ్ ఒరిజినల్ తీసుకొని ఉదయం సెషన్ వారు 9.30గంటల్లోగా, మధాహ్నం సెషన్ వారు 2.30లోగా కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. సమావేశంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణ రావు, పోలీస్, వైద్య శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

నగరాభివృద్ధికి సహకరించండి

మేయర్ విజయలక్ష్మి

43 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధి పూర్తి స్థాయిలో జరగడానికి అందరి కృషి అవసరమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 43 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పైడితల్లమ్మ పండుగ నాటికి రహదారి మరమత్తు పనులు, తెప్పోత్సవం జరిగే ప్రాంతంలో ర్యాంప్ నిర్మాణం వంటి అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ప్రజలు త్రాగాలని చెప్పారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పొందుపరిచిన 43 అంశాలకు ఆమోదం తెలిపామన్నారు. ఆగస్టు 15వ తేదీన ప్రభుత్వం ప్రారంభించనున్న అన్నా క్యాంటీన్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు, కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న ఆరోగ్యం


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు జ్వరపీడితులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో, ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. వర్షాల కారణంగా మలేరియా, డెంగ్యూ వైరల్ ఫీవర్‌లతోపాటు దగ్గు, తలనొప్పి వంటి అనారోగ్య సమస్యలు ఒకటైతే, కలుషిత నీటితో మరికొంతమంది అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల సంఖ్య మునుపెన్నడూ లేనంతగా ఉంది. ఈనేపథ్యంలో వైద్యులు కాస్త ఓపిగ్గా, మునుపటి కంటే ఎక్కువ సమయం కేటాయిస్తే తప్ప ప్రజారోగ్యం కుదుటపడే అవకాశం లేదు. ఇందుకనుగుణంగా కేవలం వైద్యులను అప్రమత్తం చేస్తే సరిపోదు. గ్రామాలు, పట్టణాలు అనే తారతమ్యం లేకుండా పరిసరాల పరిశుభ్రతకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలి. అయితే కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయాల్సిన నిధుల్లో కోత విధించింది. వచ్చిన అరకొర నిధుల్లోనూ కొంతమంది అధికారులు చిలక్కొట్టుడు వ్యవహారాలకు తెరలేపడంతో కొన్ని పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లే పరిస్థితి లేదు. వీటికితోడు మందులు, వైద్యపరీక్షలకు అవసరమయ్యే పరికరాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితి పరిమితమైన పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో మాత్రమే ఉంది. ప్రతి సిహెచ్‌సిలో రోజుకు 200 నుంచి 300 వరకూ ఒపి ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిలో అయితే, ఇటీవల కాలంలో 1500 నుంచి 1700 వరకు ఓపి ఉంటోంది. కొద్దిరోజులుగా మంచాలు కూడా ఖాళీగా లేవు. ఈ నేపథ్యంలో రోగులకు తగినన్ని బెడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఓపి సేవలకు కూడా ఇటీవల ఆన్‌లైన్ సిస్టమ్ నడుపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరు లింకు ఉంటే తప్ప ఒపి సదుపాయం ఇవ్వకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడూ సర్వర్లు బిజీగా ఉండడం వల్ల ఫోన్ నంబర్‌కు లింకు ఉన్నవారు కూడా ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విజయనగరం జిల్లా కేంద్రంలో మాత్రం ఇలాంటి సమస్య ఉన్నవారికి ఆఫ్‌లైన్‌లో ఓపి చీటీలు ఇస్తున్నారు. రాజాం సహా కొన్ని ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో లేబొరేటరీల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు లేకపోవడం వల్ల కొన్ని రకాల రక్త పరీక్షలు జరగడం లేదు. దీంతో, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో, పేదలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారులు పాలకులు ఒకింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది.



ఒలింపిక్స్‌లో విజయాలు సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మన దేశం తరపున పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులంతా తమ పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ భారతీయులంతా సందేశాలు పంపించి వారికి మద్ధతుగా నిలవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఒలింపిక్స్ క్రీడాకారులకు మద్ధతుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీర్ ఫర్ భారత్ పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం తరపున 16 క్రీడాంశాల్లో 117 మంది క్రీడా కారులు పాల్గొంటున్నారని వారంతా అత్యుత్తమ ప్రతిభ కనబరచి దేశానికి పతకాలు సాధించా లని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ గత ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు ఒక స్వర్ణం, రెండు రజితాలు సహా ఏడు పతకాలు సాధించారని, ఈ ఏడాది మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప జేయాలని కోరారు. డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సందేశాలు పంపాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో కాలానుగుణ వ్యాధులు ప్రబల కుండా మందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పారిశుధ్య పర్యవేక్షకులకు, కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో గుర్తించిన లోతట్టు ప్రాంతాలు, కుంటలు, చెరువులు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ మరింత ముమ్మరం చేయాలన్నారు. కొంతమంది కార్యదర్శులు పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నా యని, సరిదిద్దుకొని సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయాలని అన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఎంహెచ్ఒ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరి గంగయ్య వర్ధంతి

బొబ్బిలి: మున్సిపల్ మొదటి చైర్మన్ ఆరి గంగయ్య వర్ధంతి శనివారం ఘనంగా జరిగింది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆరి గంగయ్య విగ్రహానికి టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, టిడిపి నాయకులు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ ప్రసాద్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ గా ఆరి గంగయ్య అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పని చేశారని ఆయన సేవలను కొనియాడారు.

కళింగ వైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

బొబ్బిలి : కళింగ వైశ్య సంఘం నూతన కమిటీను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గెంబలి శ్రీనివాసరావు, వి.గణేష్, ఉపాధ్యక్షులుగా ఎన్. మున్నా, సహాయ కార్యదర్శిగా కె.శ్రీను, కోశాధికారిగా గుడ్ల సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళింగ వైశ్యులు, వ్యాపారుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు. నూతన అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావును అభినందించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

వంగర: మండలంలోని శివ్వాం, ఋషింగి గ్రామాల రోడ్డు మలుపుల వద్ద వంగర ఎస్‌ఐ వైవి జనార్దన్ ఆధ్వర్యంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు శనివారం ఏర్పాటు చేశారు. పలుచోట్ల పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు మలుపుల వద్ద మితిమీరిన వేగంతో వెళ్లకూడదని వాహన చోదకులకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలిపల్లిలో సినిమా షూటింగ్

భోగాపురం : మండలంలోని పోలపల్లి గ్రామంలో శనివారం సినిమా షూటింగ్ నిర్వహించారు. గ్రామంలోని ఎల్లమ్మ తల్లి గుడితో పాటు ఇతర చోట్ల ఈ షూటింగ్ జరిగింది. నూతన దర్శకుడు విజయ్ కుమార్ దర్శకత్వంలో నూతన హీరో రవి, హీరోయిన్‌గా నీలిమాపై కొన్ని సీన్లను తీశారు. సినిమా షూటింగ్ జరుగుతుందన్న విషయం తెలుసుకొని గ్రామంలో పలువురు అక్కడకు చేరుకుని తిలకించారు.

నేడు జిల్లా ఆర్యవైశ్య మహాసభ

శృంగవరపుకోట: జిల్లా ఆర్యవైశ్య మహాసభను కొత్తవలసలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ యువజన సంఘం అధ్యక్షులు హనుమాన్ శెట్టి నానాజీ తెలిపారు. ఈ సందర్భంగ శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ అధ్యక్షతన జిల్లా నూతన కార్యవర్గం, మండల శాఖల కార్యవర్గ ప్రమాణస్వీకారం జరగనుందన్నారు. దీనికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, అంబికా కృష్ణ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు వచ్చి విజయవంత చేయాలని కోరారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బొబ్బిలి: విద్యార్థులను వేధించినా, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ హెచ్చరించారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, హాస్టల్, బిసి బాలికల వసతి గృహాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, వేధింపులపై ఫిర్యాదులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుదీరిన తహశీల్దార్లు

కొత్తవలస: మండల తహశీల్దార్‌గా బి.నీలకంటారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ అప్పారావు, ఆర్ఐ, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు

బొబ్బిలిరూరల్ : బొబ్బిలి తహశీల్దార్‌గా యం.శ్రీను శనివారం భాద్యతలు స్వీకరించారు. తాను గార మండలం నుంచి బదిలీపై వచ్చానని తెలిపారు. రైతు, రెవెన్యూ సమస్యలు పరిస్కారానికి కృషి చేస్తానని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌కు డిటీలు, సిబ్బంది, ఎంపిడిఒ రవికుమార్ అభినందనలు తెలిపారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

బొబ్బిలి: రైతులకు పంట రుణాలను మాఫీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం 40లక్షల మందికి రుణమాఫీ చేసిందని, టిడిపి కూటమి ప్రభుత్వం కూడా రుణమాఫీ చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

చీపురుపల్లి: స్థానిక చీపురుపల్లి లైన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక లైన్స్ క్లబ్‌లో ఎన్నుకున్నట్లు క్లబ్ ప్రతినిధులు ఎస్‌విజి శ్రీనివాసరావు, ఎస్‌వి దుర్గారావులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా డి. సీతారామరాజు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కందుల నాగశంకర్‌తో పాటు లైన్స్‌క్లబ్ స్టార్స్ అధ్యక్షుడుగా గంట్యాడ విష్ణుమూర్తి, కార్యదర్శిగా సూరుకిరణ్‌లను నియమించినట్లు వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారితో లైన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ ఎంఎస్-ఎస్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధి సన్యాసిరావు, శ్రీరాంనగర్ లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 38,39,40 సచివాలయాల పరిధిలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు పర్యటించి పారిశుధ్యం పనితీరును పరిశీలించారు. కొన్నిచోట్ల పారిశుధ్యపరంగా మెరుగైన పనితీరు కనిపించకపోవడంతో సిబ్బందిని పిలిచి మందలించారు. బాలాజీ నగర్, తోటపాలెం, ప్రదీప్ నగర్ ప్రాంతాలలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గమనించారు. సిబ్బందిని పిలిచి తక్షణమే నీరు నిలవ లేకుండా చూడాలన్నారు.కార్యక్రమంలో ఆయా సచివాలయాల పరిధిలోని పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఈనెల 15 నుంచి 26 వరకు బ్యాక్-ఎండ్ ట్రైనింగ్ కార్యశాల విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. అవసరమైన కెరీర్ అవకాశాలకు ప్రాజెక్టులను రూపొందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు అసాధారణమైన పురోగతిని ప్రదర్శించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వేణుమాధవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఉద్యోగాలను ప్రభుత్వ కాంట్రాక్టుకు మార్చండి

విజయనగరం కోట : తమ ఉద్యోగాలను ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చాలని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఇఎస్ఐ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కోరారు. శనివారం జెడ్‌పి అతిథి గృహంలో మంత్రిని కలిసి వినతి అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఇఎస్ఐ డిస్పెన్సరీలు, డయాగ్నొస్టిక్ సెంటర్, ఆసుపత్రి ల్లో 15ఏళ్లగా అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న తమను ప్రభుత్వ కాంట్రాక్టు /రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చాలని కోరారు. ఇఎస్ఐలో చాలా కాలంగా ఎటువంటి నియామకాలు చేపట్టకపోవడంతో తమపై పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందించిన వారిలో ఇఎస్ఐ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి. నారాయణ, కార్యవర్గ సభ్యులు ఎస్. హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో అపరిచితుడి సంచారం

బొబ్బిలి: బొబ్బిలిలో అపరిచితుడు సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సంతతోట సమీపంలో అపరిచితుడు సంచరించి ఒక అపార్ట్మెంట్‌లోకి ప్రవేశించి చిన్నపిల్లలను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడంతో పాటు మహిళలు పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు చెబుతున్నారు. అపరిచితుడును స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తనతో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు చెప్పడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - తెర్లాం

మండల కేంద్రం లోని దాసర బందకు వెళ్లే ప్రధాన కాలువపై ఇటీవల గ్రామానికి చెందిన చింతల వెంకటరమణ అక్రమంగా నిర్మాణం చేపట్టారు. దీనికి అధికారులు అనేక సార్లు నోటీసులిచ్చినా స్పందించక పోవడంతో శనివారం రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో కట్టడాలను జెసిబితో తొలగించారు.


జెబితో కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

వైసిపి హయాంలో అన్ని రంగాలూ విచ్ఛిన్నం

ప్రజాశక్తి- బొండపల్లి

వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పూర్తిగా విచ్ఛిన్నమైందని, ఆయా రంగాలను దారిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అహిర్నశలు కృషి చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బోడసింగిపేటలో గల టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని దీనిని గాడిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు రోజుకు పద్దేనిమిది గంటలు కష్ట పడుతున్నారని, మంత్రులు కూడా ఆయనతో పోటీ పడుతున్నామని అన్నారు. వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటికి 2.50లక్షల కోట్లు అప్పు ఉందని 2024లో ప్రభుత్వం గద్దె దిగే సమయానికి రూ.9.50లక్షల కోట్ల అప్పును చూపించారని చెప్పారు. సంక్షేమ పథకాలకు రూ.1.50లక్షలు ఖర్చు అయ్యాయని మిగిలిన రూ. 7.50లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్రామాలలో రోడ్లు లేవని, ఇంటింటికి తాగు నీరు అందించలేదని విమర్శించారు. మద్యం రేట్లు పెరగడం వల్ల యువత గంజాయికు అలవాటు పడి తమ భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతలో గల నైపుణ్యాన్ని వెలికి తేసి వారికి ఉపాధి అవకశాలు కల్పించేందుకు కేంద్రంతో పాటు ఇతర దేశాల ప్రతినిధిలతో చర్చలు జరుపుతున్నామని అన్నారు. డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలు గ్రామాలలో చిన్న చిన్న ఇండస్ట్రీస్ పెట్టుకోవడానికి అవకాశాలు కోసం ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ఎన్నారై మంత్రిగా రాష్ట్రా అభివృద్ధిలో ఎన్నైరైలను భాగస్వాములుగా చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. పోలవరం నిర్మించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఉచిత ఇసుక అందించడం ద్వారా పలురంగాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని ఆయన తెలిపారు. స్వయం సహాయక సభ్యులు ద్వారా సేకరించిన సొమ్ముతో మహిళలకు ఆసక్తి చూపుతున్న యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం బొండపల్లిలో ఆర్ఎంఎస్ఎ నిధులతో నిర్మించి ప్రారంభానికి నోచుకోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల వసతి గృహాన్ని మంత్రి పరిశీలించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, దత్తిరాజేరు మండల పార్టీ అద్యక్షుడు చప్ప చంద్ర శేఖర్‌లతో పాటు మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, సర్పంచ్ మీసాల జానకీ రావు, ప్రదీప్ కుమార్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, జంపన రవిబాబు, జంపన సూరిబాబు, బుద్ధరాజు మురళీరాజు, చింతలపాటి చిరంజీవిరాజు, పట్నాన శ్రీనివాసరావు, మసారపు పోలినాయుడు, నాగిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి సన్యాసి రావు, కొయ్యాన ప్రసాదరావు, బొడ్డు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

బాలికలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో పీపుల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో అధ్యక్షులు విశ్వనాధ కుమార్ అధ్యక్షతన బిసి హాస్టల్ బాలికలకు ఐదు రకాల స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎం. శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేసే జర్నలిస్టులు ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యార్థులందరూ అబ్దుల్ కలాం జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కాకర శ్రీనివాస్ రావు, కార్యదర్శి మోయ్యిగణేష్, జాయింట్ సెక్రటరీ రావులపూడి గోవిందా, ట్రెజరర్ గాడి ప్రసాద్, లీగల్ అడ్వైజర్ సంతోష్, సభ్యులు ఎస్ఎ6 ఛానల్ శ్రీనివాసరావు, విసి ఛానల్ రామకృష్ణ, విబి8 ఛానల్ శ్రీనివాసరావు, జనదీపిక పత్రిక రాజు, పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజారోగ్యమే తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ వ్యర్థ జలాలను వర్షపునీటితో కలిసి వదిలేస్తున్నారని గోవిందపురం రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వ్యర్థ జలాలు వల్ల పంట కాలువల్లో ఉన్న మొక్కలు చచ్చిపోవడం చూసి ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే కాలుష్య నియంత్రణ అధికార్లకు ఫోన్ చేసి పంట కాలువలో పరిశ్రమల వ్యర్థాలు వదిలేస్తున్నారని, మీరు పరిశీలించాలని తెలిపారు. పరిశ్రమ వ్యర్థాలు జీరో డిచ్చార్జి చేసి పైపులైన్ల ద్వారా సముద్రంలోకి పంపుతున్నారని కాలుష్యం నియంత్రణ అధికార్లు ఆమెకు తెలిపారు. దీంతో ఆమె స్పందించి సముద్రంలోకి పంపుతున్నారో, పంటకాలువల్లో వదిలేస్తు న్నారో వచ్చి మీరే చూడండని అసహనం వ్యక్తం చేశారు. ఈ పంట కాలువ ద్వారా వ్యర్థ జలాలతో కొణతాలు చెరువు నిండిపోయిందని ఉప సర్పంచి బాలా అప్పలరాజు, రైతులు తెలిపారు. ఆ నీటితో సాగు చేయడం వల్ల పంటంతా కాలుష్యంగా మారిపోతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంతమంతా గాలి, నీరు కాలుష్యం అయిపోయిందన్నారు. ముఖ్యంగా మన ప్రాంతంలో నీరు రెండు రకాలుగా కాలుష్యం అవుతుందన్నారు. ఒకటి వ్యర్థ జలాలైతే రెండోది సముద్రంపు ఉప్పు నీరన్నారు. మరి కొన్ని సంవత్సరాలు పోతే ఈ ప్రాంతంలో నీరు దొరికే పరిస్థితి ఉండదన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల యజమానులందరూ కాలుష్యం నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య వెంటనే పరిష్కారం అయ్యేలా చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆమెతో పాటు గోవిందపురం సర్పంచ్ బాలా రామలక్ష్మి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు జలపారి శివ, జనసేన మండల నాయకులు పతివాడ శ్రీను, జమరాజు, బాసి దుర్గ, జనసైనికులు, రైతులు తదితరులు ఉన్నారు.


వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి- గజపతినగరం

మొక్కలు పెంపకం వాతావరణ సమతుల్యతకు దోహదపడుతుందని గజపతినగరం కోర్టు మెజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలో ఈనెల 22 నుంచి చేపడుతున్న "శిక్ష సప్తహ్" కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడుతూ కొన్ని ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు, న్యాయవాదుల సంఘం జాయింట్ సెక్రెటరీ జెర్రిపోతుల జగదీష్, వైస్ ప్రెసిడెంట్ రాపాక సాయి సురేష్, పాల్గొన్నారు.


గజపతినగరం: మొక్క నాటుతున్న మెజిస్ట్రేట్ కనకలక్ష్మి

డెంకాడ: ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని సమగ్ర శిక్ష సిఎంఒ ఆదినారాయణ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఒ ప్రసాద్, సహాయ సిఎంఒ రామారావు, సహాయ జిసిడిఒ గాయత్రి, ఏఎస్ఒ సూర్యా రావు, ఎంఇఒ-2 శ్రీరాము, హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకూ కోత

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు కోతలు పెట్టారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె విజయగౌరి అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం కేంద్ర బడ్జెట్-ప్రభావంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత తగ్గించి కార్పోరేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. స్త్రీ,శిశు సంక్షేమానికి కోతలు పెట్టారన్నారు. మాత, శిశు మరణాలు నివారణకు నిధులు పెంచాల్సి ఉన్న తగ్గించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు 19శాతం నిధులు కేటాయించారంటే దేశానికి ఎంత అప్పు ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పనపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టారన్నారు. సాధారణ ప్రజలు ప్రయాణించే రైళ్లకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా సహధ్యక్షులు ప్రసన్నకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉమాగౌరి, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బొబ్బిలి: మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

గరివిడి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని సిఐటియు డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరి నాయుడు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, కార్మిక కర్షక రైతు వ్యతిరేక బడ్జెట్ అని, ఈ బడ్జెట్‌లో కార్మిక వర్గం మీద, మధ్యతరగతి మీద, రైతుల మీద పెనుబారం వేశారన్నారు. కార్పొరేట్లకు వేలాది కోట్ల రూపాయలు రాయితీ ఇచ్చారని గ్రామీణ ఉపాధి హామీకి నిధులు తగ్గించారని గుర్తు చేశారు ఐసిడిఎస్ నిధులు పెంచకపోవడం వల్ల అంగన్వాడి సెంటర్‌లో అందుతున్న పౌష్టికాహారం భవిష్యత్తులో కొనసాగింపు కష్టమేనని చెప్పారు. ఎరువుల మీద ఇచ్చే సబ్సిడీ తగ్గించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు ఖర్చులు పెరిగి వ్యవసాయం సంక్షోభం లోకి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. దీని వల్ల ధరలు మరింత పెరిగి సామాన్యులకు భారం అవుతోందన్నారు. రాష్ట్రానికి విభజన హామీలను విస్మరించారన్నారు. విశాఖ, కడప స్టీల్ ప్లాంట్ గురించి, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించకుండా కేవలం అమరావతి నిర్మాణం కోసం 15వేల కోట్ల రూపాయలు అప్పురూపంలో ఇవ్వడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ సంఘం కార్యదర్శి ఒఎస్ఎన్ మూర్తి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఏర్పాటు చేసిన రహదారి

రహదారికి మోక్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సంఘంవలస, సారవానిపాలెం గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉపాధి హామీ నిధులు నుంచి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా శనివారం కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో గిరిజనులు ఆనంద వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణం పనులు పూర్తి అయిన ఇంకా గడ్డ ఉధృతంగా ప్రవహించే మార్గానికి రక్షణ గోడ నిర్మిస్తే బాగుంటుందని లేకపోతే రోడ్డు కోతకు గురై మళ్లీ ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు.

'సిద్ధి' ద్వారా రుణ సౌకర్యం : డిజిఎం

ప్రజాశక్తి - కొత్తవలస

పేదవారికి, వికలాంగులకు సిద్ధి సంస్థ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామని సంస్థ డిజిఎం సౌరబ్ బాజ్ప అన్నారు. శనివారం శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది వికలాంగులకు సిద్ధి స్వావలంభన ఫౌండేషన్ సహకారంతో కియస్క్ షాప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిజిఎం సౌరబ్ బాజ్ప మాట్లాడుతూ ఈ షాపుల ద్వారా స్వయం ఉపాధి పొందిన బాధితులకు లక్ష రూపాయల వరకు రుణం కల్పిస్తామన్నారు. ఈ రుణ వసతితో మీరు మీ కుటుంబాలు, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకూ రూ.52 లక్షలు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జగదీష్ బాబు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా 150 మంది వికలాగులను గుర్తించామని వారిలో 50 మందికి మాత్రమే షాప్స్ అందించారని, మిగిలిన వారికి అందించాలని కోరారు. వికలాంగులు షాపులను ఏడాది పొడవునా సక్రమంగా నడపగలిగిన వారికి ఈ సంస్థ ద్వారా లక్ష రూపాయలు తక్కువ వడ్డీతో రుణ వసతి కల్పిస్తామని అన్నారు. మిగిలిన 100 మంది వికలాంగులకు కూడా ఋణ వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 15 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధి అసోసియేట్ మేనేజర్ స్రిష్టి ఠాకూర్, ట్రస్ట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.


పరికరాలతో వికలాంగులు, సిద్ధి ప్రతినిధులు

నాగార్జున చొరవతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లాలో సమగ్ర తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులకు చాలా ఏళ్లుగా నెలకొన్న వేతనాలు సమస్య విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున చొరవతో పరిష్కారమైంది. జిల్లాలో దాదాపు 1000 మంది థర్డ్ పార్టీ ద్వారా విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బందికి ప్రభుత్వ ఎస్ఎస్ఆర్ రేటు ప్రకారం నెలకు రూ.18వేలు నుంచి రూ.20వేలు వేతనం చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.6వేలు నుంచి రూ.8వేలు చెల్లిస్తున్నారు. అరకొర వేతనంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 17న కిమిడి నాగార్జునను చీపురుపల్లిలోని ఆయన నివాసంలో జిల్లా సంఘం నాయకులు, సిబ్బంది కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన నాగార్జున జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు జిల్లాలో తాగునీటి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి నెలకు రూ.3వేల చొప్పున వేతనం పెంపుదల చేశారు. దీనికి ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేస్తూ నాగార్జునను చీపురుపల్లిలో ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. మీ చొరవతో మా సమస్య పరిష్కారమైందంటూ ఆనందం వ్యక్తం చేశారు.


నాగార్జునను సత్కరిస్తున్న ఉద్యోగులు

పెన్షనర్ల సమస్యలపై చలో ఢిల్లీ

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం మోడీ నాయకత్వంలో 2014 నుంచి ఇపిఎస్-95 పెన్షనర్ల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని దీనిపై ఆగస్టు 6,7,8 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. శంకర్రావు, అధ్యక్షులు వి.శేషగిరిరావు అన్నారు. శనివారం ఈ కార్యక్ర మానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు కోట్ల రూపాయలు కేంద్ర బడ్జెట్ నుంచి రాయితీ ఇచ్చిన బిజెపి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించమంటే సాకులు చెబుతోందన్నారు. దేశంలో 75 లక్షల మంది పెన్షన్ దారులుంటే అందులో 25 లక్షల మంది వెయ్యి రూపాయలు లోపే పెన్షన్ అందుకుంటున్నారన్నారు. అందరికీ కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బడ్జెట్ సమావేశాలు సందర్భంగా పెద్ద ఎత్తున ఆందోళన జరపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు 2019 నుంచి ఏ ఒక్కటీ పరిశీలించ కుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన బకాయి 20వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ సభ్యులు భుజంగరావు, పి. కృష్ణ, గొర్లె రామారావు పెన్షన్ దారులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి

సైబర్ సెక్యూరిటీ యాక్టివిస్ట్ వంశీ

ప్రజాశక్తి- డెంకాడ

ఇంటర్‌నెట్ నుంచి పిల్లలను దూరంగా ఉంచాలని సైబర్ సెక్యూరిటీ యాక్టివిస్ట్ వంశీ అన్నారు. స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పై శనివారం అవగాహన కల్పించారు. ధర్మవరం హైస్కూల్ వేదికగా స్కూల్ పిల్లలను సామాజిక సేవా వాలంటీర్, వంశీ కోడూరు ఇంటర్నెట్ భద్రత గురించి, క్లిష్టమైన సైబర్ సమస్యల గురించి వివరించారు. బలమైన పాస్‌వర్డ్‌లు, గోప్యతా సెట్టింగ్‌ల ప్రాముఖ్యతను వివరిస్తూ ఇంటర్నెట్‌లో మన గుర్తింపును ఏ రకంగా దొంగిలిస్తారో వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ ప్రమాదాలను, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, ఇసిఇ సిబ్బంది కిరణ్, గురుచరణ్, ఎన్ఎస్ఎస్ నాయకులు వృద్ధి, అంజలి, జాహ్నవి, వైష్ణవి, ధనలక్ష్మి, మౌనిక, దినేష్‌వర్మ, హేమంత్, కార్తీక్, నీరజ్, పార్థు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అగ్నిప్రమాదంలో ఆవులు మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని వసంత గ్రామంలో శుక్రవారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పశువుల శాలకు నిప్పు పెట్టంతో ఆవులు మృతి చెందాయి. బాధిత రైతులు సలుమూరి రామునాయుడు, వసంత బంగారియ ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయాన్నే గ్రామ శివారులో ఉన్న తమ కళ్లాలకు వెళ్ళగా పశువులు చాలా పూర్తిగా కాలిపోయి కనిపించింది. అందులో ఉన్న రెండు ఆవులు ఒక దూడ మంటలలో కాలి సజీవంగా దహనమయ్యాయి. మరో ఆవు కాలిపోయి పూర్తిగా దెబ్బతింది. గడ్డి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు మూడు లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న విఆర్ఒ రాధాకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గతంలో ఇదే ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికుప్పలకు నిప్పంటించి కాల్చివేశారని స్థానికులు చెబుతున్నారు.

విచారణకు మంత్రి ఆదేశం

వసంత గ్రామంలో శనివారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాద దుర్ఘటనపై వెంటనే విచారణ చేసి నివేదిక సమర్పించాలని, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. ఈ అగ్ని ప్రమాదంలో పశువుల శాల ధగ్ధమై, పశువులు మృత్యువాత పడటంతో ఇది మానవ ప్రేరితమని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రమాదంపై తక్షణమే విచారణ చేసి, నివేదికను సమర్పించాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు.

'నా ఆర్థిక మూలాలను దెబ్బతీశారు'

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు

ప్రజాశక్తి- చీపురుపల్లి

తన ఆర్థిక మూలాలపై గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వం దెబ్బ తీసిందని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం తనపై కక్షగట్టి సుమారు వంద కోట్ల రూపాయల మేర తనకు నష్టం కలిగించే విధంగా తనకు సంబంధించిన భూములను 22ఏలో పెట్టించిందని గద్దె తెలిపారు. శ్రీకాకుళం జిల్లా బాతువ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 46లో 1,2లకు సంబంధించి 37.40 ఎకరాల భూమిని 1987లో కొనుగోలు చేశానని చెప్పారు. ఆ భూమిని వైసిపి ప్రభుత్వం గయ్యాలిగా చూపించిందని తెలిపారు. విజయనగరంలో 1982లో తన పేరున రిజిస్ట్రేషన్ అయిన సర్వే నెంబరు 107, 108లలో సుమారు 5 వేల గజాల స్థలాన్ని చెరువుగా చూపించారన్నారు. పేరిపి రెవెన్యూలో సర్వే నెంబరు 49లో 1, 41-2లలో 9 ఎకరాల భూని 22ఏలో గత ప్రభుత్వం చూపించిందన్నారు. విశాఖపట్నంలో ఎర్రిపాలేం, కప్పరాడ రెవెన్యూలో 3.50 ఎకరాల భూమిలో కొంత భాగాన్ని గత ప్రభుత్వం దౌర్జన్యంగా కట్టడాలు చేసిందన్నారు. ఈ విధంగా తాను పూర్తిగా నష్టపోయానని, గతంలో జరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్, నారాయణ దృష్టికి తీసుకువెళ్లానని వివరంచారు.

మంచి అభిరుచులు, అలవాట్లతోనే ఆరోగ్యం

జామి : విద్యార్థి దశ నుంచే మంచి అభిరుచులు, అలవాట్లు కలిగి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యకర సమాజానికి వారధి కాగలరని డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కుమరాం కెజిబివి పాఠశాలను సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ, తాను కూడా చిన్నతనంలో ప్రభుత్వ వసతిగృహంలోనే ఉండి, చదువుకొని ఈ స్థాయికి రాగలిగానని చెప్పారు. కౌమార దశలో బాలికలు ఋతుస్రావం వల్ల, రక్తహీనత వంటి సమస్యలు ఎదుర్కొంటారని, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కెవిఎస్ పద్మావతి, డాక్టర్ వెంకటేష్, సిహెచ్ఒ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్. అనిల్ ప్రేమ కుమార్, ఇఒ నారాయణ, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శారద, స్థానిక వైద్య సిబ్బంది, విద్యార్థునులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు